క్లుప్తంగా

మంత్రులకు సాదర స్వాగతం



మంత్రి విడదల రజినికి స్వాగతం పలుకుతున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఆరోగ్య శాఖా మంత్రి విడదల రజినీలకు శుక్రవారం విశాఖ విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. వీరిని విమానాశ్రయంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మర్యాదపూర్వకంగా కలిశారు.

శ్మశానవాటికలో పాడైన దహన షెడ్డు



యల్లపువానిపాలెం శ్మశానవాటికలో విరిగిన షెడ్డు రేకులు

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు యల్లపువానిపాలెం శ్మశానవాటికలో శవ దహన వేదిక రేకుల షెడ్డు పాడైంది. బుధవారం వీచిన ఈదురు గాలులకు రేకులు ఎగిరిపోయాయని స్థానికులు తెలియజేశారు. దీంతో పాటు కొన్నాళ్ల కిందట ప్రహరీ గోడ సైతం విరిగిపోయిందని చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి శ్మశానవాటికలో పాడైన వాటిని బాగు చేయాలని వారు కోరుతున్నారు.

తాటిపూడి పైప్‌లైన్ లీకేజీ



కరాసా బీఆర్‌టీఎస్ రోడ్డులో పైప్‌లైన్ లీకై ప్రవహిస్తున్న తాగునీరు

గోపాలపట్నం: తాటిపూడి పైప్‌లైన్ లీకేజీ వల్ల తాగునీరు వృథాగా పోతోంది. జీవీఎంసీ 52వ వార్డు కరాసా వద్ద బీఆర్‌టీఎస్ సర్వీస్ రోడ్డులో కొన్నాళ్లుగా తాటిపూడి పైప్‌లైన్ లీకవుతోంది. దీంతో తాగునీరు అధికంగా రోడ్డెక్కి ప్రవహిస్తోందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు ఇక్కడి పరిస్థితిని చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. నీరు రోడ్డు పైకి రాకుండా చిన్న కాలువల్లా తవ్వేసి చేతులు దులిపేసుకున్నారని విమర్శిస్తున్నారు. గతంలో కూడా ఇక్కడ భారీగా లీకులు ఏర్పడ్డాయి. కొన్ని నెలలుగా మరమ్మతులు చేపట్టారు. ఆ తరువాత మళ్లీ అదే ప్రాంతంలో లీకులు వస్తున్నాయి. సంబంధిత అధికారులు పరిశీలించి సమస్య పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



పాటలు పాడుతున్న గాయనీ గాయకులు

సీతంపేట: సత్య సుమధుర స్వరాలు సంగీత సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో తెలుగు హిందీ సినీ సంగీత విభావరి నిర్వహించారు. ప్రముఖ గాయకుడు పి.బి.ఖాన్ నిర్వహణలో గాయనీ గాయకులు హుషారైన సినిమా పాటలు పాడి ప్రేక్షకులను అలరించారు. కళారంగ ప్రముఖులు సన్‌మూర్తి, మహమ్మద్ ఖాన్, రాజేంద్రప్రసాద్, చెక్కా రమాదేవి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గాయనీ గాయకులు పమ్మరాజు నరసింహమూర్తి, సాంబశివరావు, మెలోడి సత్యనారాయణ, పి.బి.ఖాన్, భాగ్యలక్ష్మి, రాజేశ్వరి, శైలజ, మాధురి, శ్రీదేవి కొత్త తరానికి చెందిన తెలుగు, హిందీ సినీ గీతాలను ఆలపించి ఆహుతులను కట్టిపడేశారు.

కొంపముంచిన జీవో 'రేటు'

- రోడ్డున పడ్డ కాంట్రాక్ట్ కార్మికులు
- హెచ్‌పీసీఎల్ గేటు వద్ద ఉపాధి కోసం ఎదురుచూపులు



హెచ్‌పీసీఎల్ విస్తరణ పనుల్లో ఉపాధి కోల్పోయిన కార్మికులు

మల్కాపురం: జీవో ప్రకారం రేటు వస్తే తమ బతుకులు బాగుంటాయనుకున్నారా కార్మికులు.. కానీ వారి ఆశ ఎంతో కాలం నిలవలేదు. ఆ జీవో రేటే తమ ఉపాధికి అడ్డు నిలుస్తుందని భావించడంతో దానిపై పోరాటం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. హెచ్‌పీసీఎల్(విశాఖ రిఫైనరీ) సంస్థలో రెండేళ్లుగా విస్తరణ పనులు జరుగుతున్న విషయం తెలిసిందే. అవి చేసేందుకు పలువురు కాంట్రాక్టర్లు ముందుకొచ్చి.. వారి వద్ద వందల సంఖ్యలో కార్మికులను చేర్చుకుని రెండు షిఫ్టుల రూపంలో పనులు చేపట్టే వారు. ఇక్కడ పనిచేస్తున్న కార్మికుల్లో హై స్కిల్డ్‌కు రూ.866, స్కిల్డ్‌కు రూ.788, సెమీ స్కిల్డ్‌కు రూ.671, అన్ స్కిల్డ్‌కు రూ.595 చొప్పున ఇచ్చేవారు. కొంత మంది కార్మికులకు కొందరు కాంట్రాక్టర్లు ఫిక్స్‌డ్ వేతనం ఇచ్చి వారి చేత 8 గంటల పని దినం కాకుండా అదనంగా మరో రెండు గంటలు చేయించుకునే వారు. దీనిపై గతేడాది పలు కంపెనీల్లో పనిచేస్తున్న కార్మికులంతా ఐక్యంగా నిరసన కార్యక్రమాలు, విధుల బహిష్కరణ వంటి పోరాటాలు చేశారు. దీనిపై స్పందించిన కాంట్రాక్టర్లు 2022 అక్టోబర్ 1న జీవో రేట్లు వర్తించేలా చేశారు.

అనుకున్న వేతనం ఇవ్వలేక..

గతంలో హైస్కిల్డ్‌కు రూ.866 ఇస్తే దానిని రూ.897 చేశారు. స్కిల్డ్‌కు రూ.788 నుంచి రూ.816, సెమీ స్కిల్డ్‌కు రూ.671 నుంచి రూ.695, అన్ స్కిల్డ్‌కు రూ.595 నుంచి రూ.616 పెంచారు. జీవో రేటు రావడంతో కార్మికులంతా ఆనందోత్సవాల్లో మునిగి తేలారు. అయితే సబ్ కాంట్రాక్టర్లు తక్కువ మొత్తానికి పనులు ఒప్పుకోవడంతో కార్మికులకు జీవో రేట్లు ఇవ్వలేకపోయారు. ఒక పక్క ఎల్ అండ్ టీ కంపెనీ నుంచి సకాలంలో బిల్లులు రాక.. అప్పులు చేసి కార్మికులకు వేతనాలు ఇవ్వలేక సబ్ కాంట్రాక్టర్లు తమ తమ కంపెనీలను మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో సుమారు 200 మంది వరకు కార్మికులు గత వారం నుంచి నేటి వరకు పనిలేక రోడ్డున పడ్డారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులు తమ తమ సొంతూళ్లకు వెళ్లిపోగా.. స్థానికులు మాత్రం రోజు హెచ్‌పీసీఎల్ గేటు వద్దే తిరుగుతున్నారు. ఏ మహానుభావుడైన కనికరిస్తాడేమో, తమకు ఉపాధి లభిస్తుందేమోనని వారు ఆశగా ఎదురు చూస్తున్నారు.

పేదలకు అండగా 'ఆడారి'

- గూడు కోల్పోయిన వృద్ధ దంపతులకు సొంత నిధులతో గృహ నిర్మాణం



అంబేద్కర్ కాలనీలో ఇంటి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు

సింధియా: కష్టాల్లో ఉన్న పేదలకు వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త, విశాఖ డైయిరీ చైర్మన్, ఏపీ ఎంఎస్ఎంఈ డీసీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ అండగా ఉంటున్నారు. 62వ వార్డు అంబేడ్కర్ కాలనీలో ఊడికల దాసు, సూరమ్మ దంపతులు చిన్నపాటి పూరిగుడిసెలో నివసించేవారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆ గుడిసె కూలిపోవడంతో వృద్ధ దంపతులు నిరాశ్రయులయ్యారు. ఈ విషయం తెలుసుకున్న కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు సంఘటనా స్థలానికి చేరుకుని వృద్ధ దంపతులకు ధైర్యం చెప్పారు. వారి పరిస్థితిని ఆడారి ఆనంద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన తన ఏటీఆర్ ట్రస్ట్ ద్వారా ఆ పేద దంపతులకు ఇల్లు నిర్మించి ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఇంటి నిర్మాణ పనులకు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు, స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ పేదల పాలిటి పెన్నిధిగా ఆడారి ఆనంద్‌కుమార్ నిలుస్తున్నారని కొనియాడారు. ఇప్పటికే నియోజకవర్గంలోని 14 వార్డుల్లో అనేక మంది ఆడారి తులసీరావు ట్రస్ట్ ద్వారా సామాజిక పింఛన్లతోపాటు పలు విధాలుగా సహాయ సహకారాలు పొందుతున్నారని చెప్పారు. అటువంటి వ్యక్తి ఎమ్మెల్యేగా గెలుపొందితే నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్దాడ ప్రసాద్, గుడాల బాబూరావు, రామకృష్ణ, నూకరాజు, వి.వి.కృష్ణ, నక్కా సూర్యనారాయణ, లక్ష్మి, సుబ్బారావు, సిద్ధార్థ, గాలి అప్పన్న, సత్యనారాయణ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'గైస్' లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటరమణ

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్)లో నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. దీనిని శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ ప్రారంభించారు. ఈ కాలేజీలో రూ.10 కోట్లతో నూతన భవన సముదాయం నిర్మాణం జరుగుతోంది. కొత్తగా ఏబీ బ్లాకులతోపాటు ఇప్పటికే ఉన్న పాత భవనానికి అవసరమైన నిరంతర విద్యుత్ సరఫరా కోసం ఇక్కడ ప్రత్యేకంగా 11 కేవీ హెచ్‌టీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. దీనికి అనుబంధంగా భూగర్భ కేబుల్ లైన్ ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు పూజలు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో కెమికల్ ఇంజినీరింగ్ హెడ్ డాక్టర్ బీవీ లక్ష్మణరావు, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ వర్క్స్ కార్యాలయానికి తాళాలు

ఇబ్బందులు పడుతున్న ఫిర్యాదుదారులు



గుల్లలపాలెంలో తాళం వేసి ఉన్న ఇంజినీరింగ్ వర్క్స్ కార్యాలయం

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం ఎఫ్ఆర్‌యూ ఆస్పత్రి వెనుక గల జీవీఎంసీ ఇంజినీరింగ్ వర్క్స్ కార్యాలయం ఎప్పుడూ తాళాలు వేసే ఉంటోంది. దీంతో ఇక్కడికి పలు సమస్యలపై వస్తున్న ఫిర్యాదుదారులు ఇబ్బందులు పడుతున్నారు. గంటల తరబడి వేచి ఉండలేక వెనుదిరుగాల్సి వస్తోందని వాపోతున్నారు. 40, 58, 59, 60, 61, 62, 63 వార్డుల పరిధిలో పలు అభివృద్ధి పనులు కావాలన్నా, ఇంజినీరింగ్ వర్క్స్‌కు సంబంధించిన మరమ్మతులు, వార్డుల్లోని సమస్యలపై జనం ఇక్కడికి వచ్చి ఫిర్యాదులు చేస్తుంటారు. ఎండల ప్రభావమో.. లేదా మరేదైనా కారణమో గానీ వర్క్స్ ఏఈ, వర్క్స్ ఇన్‌స్పెక్టర్లు సక్రమంగా రావడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఎవరైనా ఫిర్యాదుదారుడు వర్క్ ఇన్‌స్పెక్టర్లకు ఫోన్ చేస్తే తాము బయట ఉన్నామని, వేచి ఉండాలని బదులు ఇస్తున్నారు. వారం రోజులుగా ఇదే పరిస్థితి ఉందని పలువురు ఫిర్యాదుదారులు చెబుతున్నారు. ఈ సమస్య ఉన్నతాధికారులు స్పందించి కార్యాలయంలో అధికారులు లేదా సిబ్బంది ఎవరైనా అందుబాటులో ఉండేలా చూడాలని కోరుతున్నారు.

విచారించి చర్యలు తీసుకుంటాం

ఈ విషయంపై జీవీఎంసీ వర్క్స్ డీఈ ఏడుకొండలును వివరణ కోరగా.. ఈ సమస్య తన దృష్టిలో లేదని, దీనిపై విచారించి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎర్నిమాంబ ఆలయ హుండీ ఆదాయం రూ.15.51 లక్షలు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో శుక్రవారం దేవదాయ శాఖ సిబ్బంది, శ్రీహరి స్వచ్ఛంద సేవకులు హుండీల ఆదాయం లెక్కించారు. 44 రోజులకుగాను అమ్మవారి హుండీల ఆదాయం రూ.15,51,756 వచ్చినట్లు ఆలయ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా తెలిపారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ బి.వసంత్‌కుమార్ పర్యవేక్షణలో ఆదాయాన్ని లెక్కించారు.

రైల్వే స్టేషన్‌లో స్వల్ప మంటలు

సిబ్బంది అప్రమత్తతతో తప్పిన పెద్ద ప్రమాదం



స్విచ్ బోర్డు వద్ద చెలరేగిన మంట



విద్యుత్ కనెక్షన్‌ను తొలగించి మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో శుక్రవారం సాయంత్రం చిన్నపాటి అగ్నిప్రమాదం సంభవించింది. ఒకటో నంబర్ ప్లాట్‌ఫారం చివర్లో జీఆర్పీ పక్కన గల చల్లని తాగునీరు సరఫరా చేసే ఫ్రిజ్‌కు సరఫరా చేసే విద్యుత్ స్విచ్‌బోర్డు నుంచి ఉన్నట్టుండి మంటలు చెలరేగాయి. పరిస్థితిని గమనించిన శానిటేషన్ సిబ్బంది, రైల్వే ప్రయాణికులు సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన అక్కడకు చేరుకుని వెంటనే విద్యుత్ కనెక్షన్‌లను తప్పించారు. లేకుంటే ఇది కాస్తా షార్ట్ సర్క్యూట్ అయి పెను ప్రమాదమే జరిగేది. సిబ్బంది అప్రమత్తమై వ్యవహరించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఖాతాదారుల చెంతకు యూనియన్ బ్యాంక్



రుణ గ్రహీతకు రుణ మంజూరు పత్రాలు అందిస్తున్న సుదర్శన్ భట్

మురళీనగర్: ఖాతాదారుల చెంతకు సకాలంలో సేవలు అందించడమే లక్ష్యంగా యూనియన్ బ్యాంకు పని చేస్తోందని ఆ బ్యాంకు ముంబై సెంట్రల్ ఆఫీస్ జనరల్ మేనేజర్ సుదర్శన్ భట్ అన్నారు. శుక్రవారం నగరంలోని ఒక హోటల్‌లో రుణ గ్రహీతలతో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎంఎస్ఎంఈ అవుట్‌రీచ్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల ముంగిటకు బ్యాంకు సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన డిజిటల్ ప్రొడక్ట్స్‌ను వినియోగించుకోవాలన్నారు. బ్యాంకుకు వచ్చే పని లేకుండా వ్యోమ్ (vyom app) యాప్ ద్వారా ఇంటి వద్ద నుంచే నెఫ్ట్, ఆర్టీజీఎస్, నూతన అకౌంట్ ప్రారంభించడం, నగదు బదిలీ వంటి సేవలు పొందవచ్చని వివరించారు. ఖాతా ఏ బ్రాంచ్‌లో ఉన్నప్పటికీ ఖాతాదారుల నివాస ప్రాంతం సమీపంలోని యూనియన్ బ్యాంకు వద్దకు వెళ్లి గోల్డ్ లోన్ తీసుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా విద్యా రుణాలు, గృహ రుణాలు, ఎంఎస్ఎంఈ రుణాలకు సంబంధించి సుమారు రూ.40 కోట్లు విలువైన మంజూరు పత్రాలను రుణ గ్రహీతలకు ఆయన అందించారు. కార్యక్రమంలో విశాఖపట్నం జనరల్ మేనేజర్ సీవీఎస్ భాస్కరరావు, డిప్యూటీ జోనల్ హెడ్ సంతోష్ ప్రభు, రీజనల్ హెడ్ కె.దుండీశ్వరరావు, డిప్యూటీ రీజనల్ హెడ్ నరేష్, రమేష్, మేనేజర్లు, సిబ్బంది, 200 మంది వినియోగదారులు పాల్గొన్నారు.

వారాహి దేవి వైభవంపై ప్రవచనం



ప్రవచిస్తున్న రమ్యానంద భారతి

సీతంపేట: లలితా పరమేశ్వరి ఐదు పుష్పబాణాల నుంచి ఉద్భవించిన శక్తి వారాహి దేవి అని శ్రీశక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతీ స్వామిని అన్నారు. లలితానగర్ లలితా పీఠంలో శుక్రవారం సాయంత్రం వారాహి దేవి వైభవంపై ఆమె ప్రవచించారు. లలితా దేవి సైన్యానికి వారాహి దేవి సర్వసైన్యాధ్యక్షురాలని, ఆమెకు ప్రత్యేక రథం ఉందని తెలిపారు. లలితా పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి సమక్షంలో జరిగిన ప్రవచన లహరిలో పలువురు భక్తులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

'ఉద్యోగాలిస్తామన్న నకిలీ సంస్థను నమ్మవద్దు'

సీతమ్మధార: ఇటీవల హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ పేరిట ఓ నకిలీ సంస్థ రాష్ట్ర ప్రభుత్వ, విద్యా శాఖ అనుమతి ఉందని నమ్మబలికి ఉద్యోగాలు ఇస్తామని యువతను ఆకర్షించడానికి పలు ప్రకటనలు ఇస్తూ లక్షల రూపాయలు దండుకుంటోందని, ఆ సంస్థను ఎవరూ నమ్మవద్దని భారత స్కౌట్స్ అండ్ గైడ్స్, రాష్ట్ర కమిషనర్ నరవ ప్రకాశ్‌రావు తెలిపారు. ఈ విషయాన్ని స్కూల్స్ కమిషనర్, రాష్ట్ర భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ చీఫ్ కమిషనర్ ఎస్.రమేష్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించారన్నారు. రాష్ట్రంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ సంస్థకు మాత్రమే గుర్తింపు ఉందని, ఇంకెవరికీ అనుమతి లేదని, ఉద్యోగాల పేరిట మోసపోవద్దని వివరణ ఇచ్చినట్లు తెలిపారు.